## పి.మల్లవరం సర్పంచ్ సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల టిడిపి అధ్యక్షుడు, పి.మల్లవరం సర్పంచ్ దున్నా సత్య నారాయణ (58) అనారోగ్యంతో ఆది వారం మృతి చెందారు. గత కొంతకా లంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెం దారు. ఆయనకు భార్య సీతారత్నం, గౌతమ్, సందీప్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. పి.మల్లవరం పంచాయతీకి 2 దఫాలు సర్పంచ్‌గా ప్రజలకు సేవలం దించారు. ఆయన భౌతిక కాయనికి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సత్యనారాయణ(ఫైల్‌ఫొటో)

# 108 ఉద్యోగుల సమ్మె సైరన్

- ఈ నెల 25 నుంచి ఆందోళనకు సిద్ధం
- జిఒ 49 అమలు చేయాలని డిమాండ్
- అధికారులకు సమ్మె నోటీసులు అందజేత

ప్రజాశక్తి - కాకినాడ

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 108 ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడుతూ ఆపద్బాంధవిగా పేరొందిన 108కే ఆపద వచ్చింది. సకాలంలో జీతాలు ఇవ్వాలంటూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. విధులను బహిష్కరించి రోడ్డు ఎక్కనున్నారు. ప్రభుత్వాలు మారుతున్న తమ తలరాత మారడం లేదంటూ 108 ఉద్యోగులు యుద్ధానికి సిద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశించిన వారికి వేధింపులు తప్పడం లేదు.

సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ భారాన్ని మోయలేక ఆర్థిక ఇబ్బందుల్లో 108 ఉద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారు. ఉద్యోగ భద్రత, పని ఒత్తిడి, జిఒ నెంబర్ 49 అమలు తదితర సమస్యలు సుదీర్ఘకాలంగా వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు 108 ఉద్యోగ సంఘం నాయకులు జిల్లా అధికారులకు నోటీసులు అందజేశారు.

కాకినాడ జిల్లాలో 108 వాహనాలు 23 నడుస్తున్నాయి. ఇవి ప్రతిరోజు సుమారు 9 వేల నుంచి 10 వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. ప్రతిరోజు సుమారు 200 నుంచి 250 మందికి 108 సేవలు అందిస్తుంది. వీరికి సేవలు అందించేందుకు ఇఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు) 54 మంది, (2 ఖాళీలు), పైలెట్లు 50 (ఆరు ఖాళీలు) పని చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అత్యవసర వైద్య సేవలు అందించడంలో వీరంతా కీలకంగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పుడు వీరికి ఆర్థిక కష్టాలు వచ్చాయి. ఆపదలో ఆదుకునేవారు ఆకలితో అలమటించే పరిస్థితి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతుంది. మూడు నెలల జీతాలు పెండింగ్లో ఉంటే ఒక నెల జీతం వేసి మిగతా రెండు నెలలు జీతాలను మరల వాయిదాలు వేయడం జరుగుతుండటంతో ఉద్యోగ భద్రత లేదని 108 ఉద్యోగులు కోడై కూస్తున్నారు. ఇవి పరిష్కారం కాకపోవడంతో రాష్ట్ర ఉద్యోగుల యూనియన్ సమ్మె సైరన్ మోగించింది. ఈ మేరకు జిల్లాలోని నాయకులు కలెక్టర్, డిఆర్ఒ, డిఎంహెచ్ఒ, ఎంపిడిఒ, తహశీల్దార్లను కలిసి నోటీసులు ఇచ్చారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న ఈ సమ్మెకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకూ ఈ సమ్మె ఆగదని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.

డిఎంహెచ్ఒ నాయక్‌కు సమ్మె నోటీసును అందిస్తున్న 108 ఉద్యోగుల సంఘం నాయకులు(ఫైల్ ఫొటో)

### సమ్మెతో అత్యవసర సేవలు పరిస్థితి ఏంటి?

108 ఉద్యోగులు సమ్మెకు ముహూర్తం ఖరారు చేశారు. దీంతో అత్యవసర సేవలకు బ్రేకులు పడనున్నాయి. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారిని, గర్భిణీలు, ఇతరత్రా అత్యవసర కేసులకు ఈ సేవలను అధిక సంఖ్యలో వినియోగిస్తున్నారు. అయితే ఈ సమ్మె కారణంగా వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోనున్నాయి. ఉద్యోగులంతా రోడ్డుపైకి రానున్నారు. వాహనాలు సైతం కదిలే పరిస్థితి కనిపించడం లేదు. అయితే ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

### 108 ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లింపులు జరగాలి. జీత పై 40 శాతం ఇంక్రిమెంట్‌ను అందించాలి. అరియర్స్‌ను కలిపి వేతనంతో జమ చేయాలి. జిఒ నెంబర్ 49ని పునరుద్ధరించాలి. పైలట్ గ్రాట్యూటీ, ఎర్నుడు లీవ్ ఎమౌంటు (ఆర్జిత సెలవు మొత్తం) వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించాలి. ఇపిఎఫ్‌కు యాజమాన్య వాటా సొమ్మును యాజమాన్యమే చెల్లించాలి. 108 సర్వీస్‌లోని ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి. 108లో షిఫ్టుల పద్ధతిని అమలు చేయాలి. 8 గంటలు పని చేసేలా చర్యలు తీసుకోవాలి. 108 సేవలను అత్యవసర సేవలకు మాత్రమే వినియోగించాలి. సిబ్బంది కొరతను అధిగమించాలి. ప్రతి మండల కేంద్రంలోనూ సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలి. వాహనాలకు మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేయాలి. వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టే నియామకాలలో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.

### మూడేళ్లుగా పెరగని జీతాలు

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమకు జీతాలు పెంచాలి. కానీ మూడేళ్లుగా జీతాల పెంపుదల జరగలేదు. జీతాలు పెంచకుండా ఉద్యోగులపై ప్రభుత్వాలు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయి. దీనివల్ల ఉద్యోగుల కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. మూడు, నాలుగు నెలలకు ఒకనెల జీతం ఇస్తూ ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలి.

-సిహెచ్ రాజ్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు, 108 ఉద్యోగుల సంఘం

### 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రభుత్వాలు మారిన ప్రతీసారి సర్వీస్ ప్రొవైడర్స్‌ను మార్చడం వల్ల సెలవులు, గ్రాట్యూటి రూపంలో ఆర్థికంగా నష్ట పోతున్నాము. ప్రభుత్వాలు తమ అనుకూల విధేయ కంపెనీలకు 108 నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్ల ఉద్యోగులకు జరుగుతున్న నష్టాన్ని పట్టించుకోకుండా తాత్సారం చేస్తున్నాయి. యాజమాన్యం తరపున చెల్లించే పిఎఫ్ వాటా కూడా ఉద్యోగుల జీతాల నుంచి కత్తిరిస్తూ నష్టాన్ని చేస్తున్నాయి.

-పివివి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు, 108 ఉద్యోగుల సంఘం

## పోరాటాలతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

పోరాటాలు, సత్యాగ్రహ దీక్షల ద్వారానే మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అయ్యాయని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తి అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆదివారం పట్టణ యుటిఎఫ్ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నికలు ఎన్నికల అధికారి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యుటిఎఫ్ దశలవారీగా తలపెట్టిన ఉద్యమ పోరాటాల వల్ల పదోన్నతి షెడ్యూలు సాధించుకో గలిగామని, ఎన్నికలు అనంతరం షెడ్యూల్ ప్రకారం పదోన్నతులు పూర్తవుతాయని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోటకూర చక్రవర్తి మాట్లాడుతూ 20 సంవత్స రాలుగా పెండింగ్లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యను పరిష్కరించడం యుటిఎఫ్ ద్వారానే సాధ్యమైందని తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారిగా వచ్చిన నూకరాజు యుటిఎఫ్ పట్టణ శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నగేష్

### యుటిఎఫ్ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

పట్టణ యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఆర్.గణేష్, కె.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. పట్టణ యూటిఎఫ్ గౌరవ అధ్యక్షులుగా కెవివి.సత్యనారాయణ, కోశాధికారిగా సయ్యద్ సైఫుల్ల, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలుగా ఆర్.శైలజ, అసోసియేట్ అధ్యక్షుడుగా ఎస్.రాజా, కార్యదర్శులుగా పి.కాశీ విశ్వనాథం, టిఎస్.పద్మావతి, ఎం.వీరమణి, జె.ప్రవీణ, కె.జగదీష్, గురుప్రకాష్, డి. వీరన్న, జిల్లా కౌన్సిలర్స్‌గా ఎం.నాగేశ్వరరావు, జి.బేబీరాణి, కెఎస్.శేఖర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఉపాధ్యాయులు సత్కరించారు.

ఆర్.గణేష్

కె.శ్రీనివాస్

## ఆయాల బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ ఆయాలకు 4 నెలలుగా బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని స్కూల్ ఆయాల సంఘం కార్యదర్శి బర్ల నాగమణి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో కర్రి దుర్గ అధ్యక్షతన జరిగిన స్కూల్ ఆయాల సంఘం సర్వసభ్య సమా వేశంలో ఆమె మాట్లాడుతూ స్కూల్ సమయాలలో ప్రతిరోజు ఉపాధ్యాయుల కంటే ముందు వచ్చి విధులు నిర్వహించి ఉపాధ్యాయులు, విద్యార్థులు వెళ్లిపోయిన తర్వాత స్కూలుకు తాళాలు వేసుకుని వెళ్తున్నామని, అయినా తమ శ్రమకు గుర్తింపు లభించడం లేదన్నారు. శాసనసభలో ఆర్థిక మంత్రి ఆయాలకు బకాయిలు లేవని ప్రకటించటం అన్యాయ మన్నారు. అదే నిజమైతే తమ జీతాలు ఎక్కడ ఆగిపోయాయో అధికారులు చెప్పాలన్నారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించకపోతే సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఈ సమా వేశంలో వసంతల నాగమణి, దాసరి నాగమణి, కర్రి లక్ష్మి, మందపాటి అన్నపూర్ణ, ఫాతిమా, సత్యనారా యణమ్మ, తోట లక్ష్మి, పుప్పాల రామలక్ష్మి, బి ఈశ్వరి, సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకురాలు నాగమణి

## ఘనంగా చేనేత వర్గాల వన సమారాధన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక చేనేత కులాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముప్పన వారి గాలి బంగళాలో చేనేత వర్గాల వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు, బాలలకు, యువతీ యువకులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు అతిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ముప్పన శ్యామలాంబ, కూటమి నాయకులు పొలమరశెట్టి సత్తిబాబు, విత్తనాల వెంకటరమణ, జెట్టి రాజబ్బాయి, తూతిక రాజు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు

## 6 గ్రామాల విలీనం పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలంలోని ఆరు గ్రామాలను నగర పాలక సంస్థలో విలీనం చేయాలని సిపిఎం నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, చింతపల్లి అజేయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విలీన గ్రామాలైన ఇంద్రపాలెం, చీడిగ, తూరంగి, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట కోసం ఎంఎల్ఎ పంతం నానాజీ అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లడం పట్ల వారు ధన్యావాదాలు తెలిపారు. గత 14 ఏళ్లగా ఆయా గ్రామాలకు పాలకవర్గాలు లేకపోవడంతో నిధుల కొరతతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నగర పాలక సంస్థలో ఆరు గ్రామాలను విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందుకు బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగానే ఆయా గ్రామాలను నగర పాలక సంస్థలో విలీనం చేశారని వారు గుర్తు చేశారు. హైకోర్టు తీర్పు ప్రకారం నగర పాలక సంస్థలో ఈ గ్రామాలను విలీనం చేసే అవకాశం లేదని ఎంఎల్ఎ పంతం నానాజీ మాట్లాడడం అసెంబ్లీని తప్పు దోవ పట్టించినట్లుందన్నారు. గ్రామాలను విలీనం చేసిన తరువాతే నగర పాలక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని పోరాటం చేసిన వారిలో పంతం నానాజీ ఉన్నారని గుర్తు చేశారు. విలీన గ్రామాల పరిస్థితిపై అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి, ఆయా గ్రామాల అభివృద్ధికి కారణాలను విశ్లేషించి ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా విలీనం చేయాలని వారు కోరారు.

వన సమారాధనలో పాల్గొన్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు

## వెలమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి వెలమ సంఘం ఆధ్వర్యంలో సింగరంపాలెం వెళ్లే రహదారిలో పామాయిల్ తోట వద్ద కార్తిక వన సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు జ్యోతుల నెహ్రూ, ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమి బాబు, నాయకులు కందుల చిట్టిబాబు, టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహనరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సంఘీయులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయమని వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ఆదివారం మండలంలోని ఏలూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గజ్జనపూడి గ్రామానికి చెందిన చంద్రాడ ముసలయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అధినేత జగన్మోహన్ రెడ్డిపై ప్రజల్లో ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదన్నారు. కూటమి పార్టీలు కుటీల రాజకీయాలతో అధికారంలోకి వచ్చాయన్నారు. వైసిపి కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకే త్వరలోనే జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జనపూడి సర్పంచ్ గొనగాల అప్పలరాజు, కొట్టేటి అబ్బులు, బొల్లు నాగేశ్వరరావు, మాగాపు శివ, దాడిశెట్టి గోపి పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న ముదునూరి


కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంఎల్ఎ చినరాజప్ప

### ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆర్‌బి.కొత్తూరు జడ్‌పి హైస్కూల్ ఆవరణలో ఆదివారం టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్లు అవసరమైన వారిని 40 మందిని గుర్తించినట్లు డాక్టర్ అవని తెలిపారు. 40 మందికి కిరణ్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వల్లూరి సోమ నాథ్, మన్యం దేవబాబు, నూనె రామారావు, జనసేన నాయకులు సబ్బినీడి హరిబాబు, మొల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న పట్టాభి రామిరెడ్డి

### పామాయిల్ రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సుబ్బయమ్మపేటలో ఆయిల్ ఫామ్ రైతులకు సర్పంచ్ బొబ్బర శివకుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ హెడ్ ప్లాంటేషనన్స్ వి.పట్టాభి రామిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆయిల్ ఫామ్ తోటలను వేసుకోవడం మూలంగా అధిక లాభాలను పొందవచ్చన్నారు. ఆయిల్ ఫామ్ పంట యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిజిఎం ఎఎస్. ప్రకాష్ రైతులకు కంపెనీ కల్పించే సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బర. శివకుమార్, కంపెనీ సిబ్బంది వీర్రాజు, దుర్గాప్రసాద్, గణేశ్వరరావు, ఎస్‌వి.మణికుమార్, డి.దుర్గా ప్రసాద్, హార్టికల్చర్ విహెచ్ఎ. సుధ, సత్యనారాయణ పాల్గొన్నారు.

## బాక్సింగ్ పోటీలకు పిఠాపురం విద్యార్థులు

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ పి లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తాటిపాకలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ అండర్ 17 బాల బాలికల విభాగంలో లిటిల్ సోల్జర్స్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న బి.నాగరుతిక 46 కేజీల భాగంలో, భాష్యం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న జెఆర్. అరుణ్ 70 కేజీల విభాగంలో ఎంపికయ్యారన్నారు. వీరిద్దరూ ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ ఉమ్మడి కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొంటార న్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాక్సర్స్‌ను డిస్టిక్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎల్.జార్జ్ అభినందించారు.

## 6 పంచాయతీలకు ఎన్నికలు అసాధ్యం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

2016లో గవర్నర్ ఆర్డినెన్స్ ప్రభుత్వ గెజిట్‌తో నగర పాలక సంస్థలో విలీనమైన పంచాయతీలకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎన్నికల నిర్వహించడం సాధ్యం కాదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. పంచాయతీ పాలన లేకుండా చట్టపరంగా వేరు చేసినందున భవిష్యత్తులో వాటిని వెనక్కి తీసుకొచ్చి పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగం ఒప్పుకోదన్నారు. తప్పుడు వాదనలు..వ్యాజ్యాలు ఎన్ని సృష్టించినా కోర్టులు ఇటువంటి అసంబద్ధ వాదనలను అంగీకరించవన్నారు. రాజ్యాంగం ప్రకారం పంచాయతీ రాజ్ పరిధి నుంచి ప్రభుత్వ గెజిట్ ద్వారా వేరు చేసిన గ్రామాలను పంచాయతీ పాలనలోకి తిరిగి ప్రవేశ పెట్టే అవకాశం ఎంత మాత్రం లేదన్నారు. గెజిట్ ఇప్పటికీ అమలులోనే ఉందన్నారు. ప్రత్యేక అధికారుల తీర్మానాలు చట్టబద్ధం అయినందునే చంద్రబాబు ప్రభుత్వ హయాం లోనే వాటిని అమలు చేశారన్నారు. వ్యాజ్యాలకు తావు లేకుండా దస్త్రాలు అప్పగించి విలీన గ్రామాలతో కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట - ప్రజాశక్తి

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం సోమవారం కోటపేట, పాత రెవెన్యూ కార్యాలయం, పెద్ద బజారు, బలుసులు పేట, ఇందిరా కాలనీ, నీలమ్మ చెరువు, కుమ్మర వీధి, సంగీతరావుపేట, మెహర్ కాంప్లెక్స్, పోస్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

### కార్టూ'నిజం'




## విలువలను పెంపొందించడమే సాహిత్యం లక్ష్యం

**57వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.**

ప్రజాశక్తి - యంత్రాంగం

**పెద్దాపురం** ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక సమాజం వరకూ సామాజిక విలువలను పెంపొందించడలో సాహిత్యం ప్రముఖ పాత్ర వహించిందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు అన్నారు. ఆదివారం స్థానిక శా ఖా గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కవి సమ్మేళన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఏ కాలంలో నైనా మంచి, మానవత్వం, సామాజిక హితం చుట్టూ అల్లుకున్న కవిత్వమే సామాజిక చైతన్యానికి దోహద పడిందని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం అన్నారు. ఈ సభలో ప్రజానాట్య మండలి కళాకారులు దారపురెడ్డి సత్యనారాయణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, మహపాతిన రాంబాబు దేశభక్తి, చైతన్య గీతాలను ఆలపించారు. ఈ సభలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, రంగారావు, సింగం బుల్లయ్య, మరియమ్మ, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని పెదబ్రహ్మదేవం శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో పర్యావరణం పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు, జూనియర్ విభాగంలో ఉదయించే సూర్యుడు అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సి మణి కుమారి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. **గొల్లప్రోలు** స్థానిక మలిరెడ్డి సరస్వతి మెమోరియల్ గ్రంథాలయంలో రచయితల సందేశాలు, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సదస్సులో రచయిత ప్రసాద్ మాట్లాడారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎంవిఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు కుర్ర నారాయణరావు, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, విశ్రాంత ఉపాధ్యాయులు కొశిరెడ్డి త్రిమూర్తులు, స్వచ్ఛ గొల్లప్రోలు సభ్యులు మలిరెడ్డి నారాయణరావు, కర్రి కొండలరావు, కీర్తి ఆదినారాయణ, పాఠకులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరామయ్య చిత్రపటానికి గురుకుల కళాశాల అధ్యాపకురాలు రజిని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ, గురుకుల పాఠశాల లైబ్రేరియన్ శ్యామల, శిడగం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సామర్లకోటలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దాపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణబాబు

# పంట మార్పిడితో చీడ పీడల నివారణ

## ప్రజాశక్తితో వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రైతులు ప్రతిసారీ ఒకే రకం పంటను సాగు చేస్తూండటంతో భూసారానికి ముప్పు వాటిల్లుతోంది. ముఖ్యంగా కొన్ని వాణిజ్య పంటలు లాభదాయకంగా ఉండటంతో రైతులు అదే పంటను తమ పొలంలో ప్రతి ఏటా సాగు చేస్తున్నారు. దీనివలన భూసారం క్షీణించడంతో పాటు చీడపీడలు విజృంభించడంతో రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. అందువల్ల పంట మార్పిడి చేసుకోవాలి' అని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. ఎరువులు, పురుగుల మందుల ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. ఇంకా పలు అంశాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

**పంటల మార్పిడి విధానం ఏ విధంగా మేలు.?**

గత కొన్నేళ్లుగా పంట దిగుబడులు క్రమేపీ తగ్గుతున్నాయి. ఫలితంగా రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దీనిని అధిగమించేందుకు పంటల మార్పిడి విధానం మేలని రైతులకు సూచనలు ఇస్తున్నాం. దీనివలన భూసారం పెరిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఖర్చులు కూడా తగ్గుతాయి. రెండు మూడేళ్లకొకసారైనా పంట మార్పిడి చేస్తే చీడపీడలను అదుపులో ఉంచవచ్చు. ఒక పంటను ఆశించే చీడ పీడలు రెండో పంటను ఆశించవు. పంట మార్పిడి విధానంలో రెండు మూడు పంటలు పండించడం వల్ల ఏదైన ఒక పంటకు గిట్టుబాటు ధర దక్కకపోయినా ఇతర పంటల వల్ల తగిన లాభం పొందే అవకాశం ఉంటుంది. అంతే కాదు దిగుబడి కూడా పెంచుకోవచ్చు. రైతులందరూ ఒకే రకమైన పంట సాగు చేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికంగా ఉంటోంది.

**ఏ విధంగా పంటలను మార్పు చేయాలి.?**

భూమిలో తక్కువ లోతుకు వేర్లు చొచ్చుకుపోయే పైర్లను, వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయే పైర్లతో మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ, పోషకాలను మొక్కలు సమర్థంగా వినియోగించుకుంటాయి. పత్తి సాగు చేసిన పొలంలో మిరప పంట వేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప పంట వేసిన పొలంలో పత్తి సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మిరప సాగుకు ముందు భూమిలో జనుము, పిల్లిపెసర వంటివి సాగు చేసి, ట్రాక్టర్ ద్వారా తొక్కిస్తే భూసారం పెరిగి, చీడపీడలు దరి చేరవు. నులిపురుగులున్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేయరాదు. అవి వేస్తే పురుగులు మరింత వృద్ధి చెందుతాయి. నేలంతా పూర్తిగా కప్పే వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము వంటి పంటలనే పంట మార్పిడికి ఎంచుకోవాలి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.

**తెగుళ్లు ఆశించకుండా ఉండాలంటే ఏం చేయాలి ?**

వరి తర్వాత పప్పుధాన్యాలు లేదా నూనె గింజల పంటలు సాగు చేస్తే వరిని తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి. భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదికి రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది. తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలు సాగు చేసుకోవచ్చు. కంది సాగు వల్ల ఆ పైరు ఆకులు రాలడంతో సేంద్రియ పదార్థం పెరిగి, భూసారం వృద్ధి చెందుతుంది. వేరు శనగ, కంది, శనగ వంటి వాటి వేర్ల బుడిపెల్లో రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజని స్వీకరించి, నేలను సారవంతం చేస్తుంది.

**సమీకృత వ్యవసాయం ఎలా చేపట్టాలి.?**

రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ శాస్త్రవేత్తలతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఒక ఎకరం భూమిలో ఫిష్ కల్చర్, వరి, కోళ్ల ఫామ్, కూరగాయలు పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మెట్ట ప్రాంతంలో బోర్లు అందుబాటులో ఉన్న రైతులు వరికి బదులు రాగులు, కొర్రలు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు సాగు చేస్తున్నారు. వరి పంట కాలం సుమారు 120 నుంచి 150 రోజులు. అదే చిరు ధాన్యాలు సాగు చేస్తే 30 రోజుల్లోనే పంట కాలం పూర్తవుతుంది. ఫలితంగా ఏడాదికి మూడు పంటలు పండించవచ్చు. ఎకరానికి పెట్టుబడి పోను రూ.50 వేల వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. వరి సాగు చేస్తే పెట్టుబడి సీజన్లు కలిపి రూ.25 వేలు మాత్రమే మిగులుతుంది. రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

## నేరాలు ఘోరాలు

బ్రీత్ ఎన్‌లైజర్‌తో తనిఖీ చేస్తున్న ఎస్ఐ

### డ్రంక్ డ్రైవ్‌లో 26 మందిపై కేసులు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని పి.మల్లవరం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందిపై కేసులు నమోదు చేసినట్లు కోరంగి ఎస్ఐ. పి.సత్యనారాయణ తెలిపారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన వారిని కాకినాడ సెకండ్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

### 42 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టణ, మండల పరిధిలోని ఆర్‌బి.కొత్తూరు, గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన దాడుల్లో 42 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో అక్రమంగా నిలవ చేసిన 14 మద్యం బాటిళ్లు, సారా తయారీకి ఉపయోగించే 90 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసామన్నారు. ఈ దాడుల్లో ఇఎస్‌టిఎఫ్ కాకినాడ సిబ్బంది, పెద్దాపురం ఎక్సైజ్ సిబ్బంది, ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

### అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

రెండు రోజుల క్రితం బాలికపై అత్యాచారానికి పాల్పడిన తాడేపల్లిగూడెం మండలం పట్టెంపాలెం గ్రామానికి చెందిన సనమండ్ర కమల్‌ను అరెస్టు చేసి ఆదివారం నిడదవోలు కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ కె.నరేందర్ తెలిపారు. మేజిస్ట్రేట్ నిందితునికి రిమాండ్ విధించినట్టు తెలిపారు. బాలికను సమిశ్రగూడెం హాస్టల్ నుంచి తీసుకువచ్చి చాగల్లు మండలం ధారవరంలో బంధువుల ఇంటికి తీసుకువెళ్లి నిందితుడు అత్యాచారం చేసినట్టు కేసు నమోదు చేశారు. కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ కేసు నమోదైన 30 గంటల్లోపే నిందితుని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

### నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కమిషనర్ భావన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్లో ద్వారా వచ్చే సమస్యలను నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో నేరుగా ప్రజలు అందించే సమస్యల అర్జీలను స్వీకరిస్తామన్నారు. నగర ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

బహుమతులు అందుకున్న విద్యార్థినులు

### ఘనంగా అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవపట్నం గ్రామంలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల మందిరంలో ఆదివారం అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైకుంఠపాళీ, కేరమ్స్, చదరంగం వంటి ఇన్ డోర్ గేమ్స్‌ను నిర్వహించారు. కథలు, చదువు విలువ కథను నాటకీకరణ ప్రదర్శించారు. చిత్రలేఖనం, పాటలు, పద్యాలు, ఒరిగామి అంశాలపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ అందజేశారు.

### వన సమారాధన

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రౌతులపూడి గ్రామ శివారున ఆదివారం కాపు వంటరి బలిజ సామాజికవర్గానికి చెందిన వన సమారాధన జరిగింది. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున సంఘీయులు పాల్గొన్నారు.

### నిరుపేద కుటుంబాలకు ఆసరా

ప్రజాశక్తి - కరప

మండలం వేలంగి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు రూ.10 వేలు విలువ చేసే రేషన్, నిత్యవసర సరుకులు ఆదివారం అందజేశారు. ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ పేదలకు ఆయా సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసరా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు అలీం, సునంద, సుబ్రహ్మణ్యం, ఇమ్రాన్, దుర్గాదేవి, ప్రశాంత్, సుధాని పాల్గొన్నారు.

### ఘనంగా కోత పండుగ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో డాక్టర్ బి ప్రభాకర్, సంఘ కోశాధికారి టి.స్టాలిన్ ధర్మదాస్, పిసిసి, ఎలోసిసి ఆధ్వర్యంలో ఆదివారం కోత పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కోత పండుగ అంటే కృతజ్ఞత పండుగని, హృదయాల సమర్పనే నిజమైన కోత పండుగ అన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా వజ్రాయుధ కవి సోమసుందర్ జయంతి

ప్రజాశక్తి - కాకినాడ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

శతాధిక గ్రంథకర్త, అభ్యుదయ కవి ఆవంత్స సోమసుందర్ శతజయంతి సభ స్థానిక చల్లా జగన్నాథ శాస్త్రి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొని సోమసుందర్ సాహిత్యాన్ని, సాన్నిహిత్యాన్ని వివరించారు. అరసం అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కార్యదర్శి వల్లూరి శివప్రసాద్‌లు సోమసుందర్ అభ్యుదయ దృక్పథాన్ని ప్రస్తుతించారు. డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ఆయన వ్యక్తిత్వ ఔన్నత్యాన్ని వివరించారు. శశికాంత్ శాతకర్ణి అధ్యక్షత వహించిన మొదటి సమావేశంలో డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సోమసుందర్ విమర్శనా రీతిని, అవధానుల మణిబాబు సోమసుందర్ కవిత్వ పరిణామక్రమాన్ని వివరించారు. చందు సుబ్బారావు రచించిన న్యూఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన ఆవంత్స సోమసుందర్ గ్రంథాన్ని ఎంఎల్ఎ మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పావని, పిఠాపురం మహారాజా కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కిలారి గౌరి నాయుడు అభ్యుదయ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో విజయ శేషేంద్ర శాతకర్ణి, డాక్టర్ జి.అనురాధ, గట్టి శ్రీకృష్ణదేవరాయలు, కవులు రచయితలు, సోమ సుందర్ అభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

ఎంపికైన పురుష, మహిళల జట్లు

71వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనే అంతర్ జిల్లాల కబడ్డీ పురుషులు, మహిళా క్రీడాకారుల జట్లను ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక కార్యక్రమం జరిగింది. డిసెంబర్ 5 నుంచి 8 వరకూ ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగే 71వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో తూర్పుగోదావరి జిల్లా తరపున ప్రస్తుతం ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కోచ్ సాయి ప్రసాద్, నిమ్మకాయల కిరణ్‌కుమార్, అంతర్జాతీయ క్రీడాకారిణి శ్వేత, రిటైర్డ్ పిఇటి తాళ్లూరి వైకుంఠం, వి.శ్రీనివాస్ సెలక్షన్ కమిటీగా వ్యవహరించారు. సామర్లకోట ఎస్‌బిఎస్ఆర్ క్లబ్ సభ్యులు బుల్లి, వీరబాబు, కోట్నీ, రవి, ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు కె.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాస్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోలి దొరబాబు, కౌన్సిలర్ బలుసు వాసు, హై స్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

చిన్నారులను అభినందిస్తున్న ఎస్పి విక్రాంత్‌పాటిల్

## విజేతలకు ఎస్పి అభినందనలు

ప్రజాశక్తి - కాకినాడ

రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ క్రీడలకు ఎంపికైన జిల్లా పోలీస్ కానిస్టేబుల్స్ పిల్లలను ఎస్పి విక్రాంత్ పాటిల్ అభినందించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ కానిస్టేబుల్ కె.రాజేష్ కుమారుడు ఒకతో తరగతి చదువుతున్న కె.హన్సిత్ రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభను చాటుకున్నాడు. అలాగే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్- 2 కానిస్టేబుల్ వి.వీరకృష్ణ కుమారుడు ఐదో తరగతి చదువుతున్న వి.రిషిశ్వర్ రోలర్ స్కేటింగ్ నందు ప్రతిభ చూపిస్తున్నాడు. వీరిద్దరూ ఇటీవల జరిగిన పోటీల్లో పలు మెడల్స్‌ను సాధించారు. డిసెంబర్‌లో కర్ణాటక రాష్ట్రంలోను మైసూరులో జరగబోవు 62వ జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరుపున అండర్-11 విభాగంలో ఎంపికైన వీరిని ఎస్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోలర్ స్కేటింగ్‌లో ఉత్తమంగా రాణిస్తున్న కానిస్టేబుల్స్ పిల్లలకు పోలీసు శాఖ యొక్క సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని సీతానగరం గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం జరిగింది. ప్రజల సహకారంతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నిర్మాణాన్ని పూర్తి చేసిన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సతీమణి జ్యోతుల లక్ష్మీదేవి, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, బోధ శివ, కొండ్రోతు శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

ఉత్తమ ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎంఇఒలు

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సయ్యద్ సైపుల్లా సేవలు అభినందనీయమని సామర్ల కోట ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య కొనియాడారు. ఆదివారం యుటి ఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సయ్యద్ సైపుల్లాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక అగస్తనా మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ ఎస్‌జిటిగా పనిచేస్తున్న సయ్యద్ సైపుల్లాకు రాష్ట్ర ఉత్తమ అవార్డు రావడం సామర్లకోట మండలానికే గర్వకారణమన్నారు. విద్యార్థులకు ఉర్దూ మీడియంలో పాఠ్యాంశాలు బోధించడానికి పాఠ్యపుస్తకాలు తానే తెచ్చుకుని ఎంతో నిబద్ధత పని చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం టి.శ్యాంసుందర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు వై.ప్రభాకర్, బి.మోహన్‌రావు, యుటిఎఫ్ జిల్లా బాధ్యులు పి.గిరిధర్ గోపాలరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెస్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

సమస్యలపై చర్చిస్తున్న యూనియన్ నాయకులు

వేతన బకాయిలు చెల్లించాలని కాకినాడ జిజి హెచ్ మెస్ కార్మికులు కోరారు. ఆదివారం స్థానిక జిజిహెచ్‌లో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ నెలలో సగం రోజులు గడిచినా సెప్టెంబర్, అక్టోబరు నెలల జీతాలు, ఏడు నెలల పిఎఫ్, ఇఎస్ఐ సొమ్మును కాంట్రాక్టర్ ఇవ్వలేదన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు సమస్యను తెలియజేసిన ఎటువంటి స్పందన లేకుండా పోయిందన్నారు. అందుకు దశల వారి పోరాటం చేయాలని ఈ సమావేశంలో కార్మికులు తీర్మానించినట్లు నాయకులు తెలిపారు. ఈ విషయమై అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు మలక వెంకటరమణ కోరారు. ఈ కార్యక్రమంలో మెస్ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - కరప

శిక్షణ ఇస్తున్న ఇలియాజర్

భూమి ఆరోగ్యాన్ని కాపాడడం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమవుతుందని ఎపి సిఎన్‌ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఇలియాజర్ అన్నారు. మండలంలోని యండమూరు, జడ్.భావరం, కొంగోడు, యూనిట్లలో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సామర్లకోట టిటిడిసి సెంటర్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రకతి వ్యవసాయ కార్యక్రమాలైన సార్వత్రిక సూత్రాలు, ఆర్‌డిఎస్ కిట్స్, పిఎండిఎస్ కిట్స్ తయారీ విధానం పలు పంటల విధానం, ఏ గ్రేడ్ మోడల్, ఎటిఎం మోడల్, డిజిటల్ స్కిల్స్, మార్కెటింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. రసాయనకి ఎరువులు వాడకం ద్వారా భూమి ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి భవిష్యత్తు తరాలకు ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందనిసూచించారు. ప్రస్తుతం రసాయనాలతో పండించిన పంటల వలన ప్రజల ఆరోగ్యాలు ముప్పు వాటిల్లుతుందని ఈ ప్రమాదాన్ని అధిగమించేందుకు రైతులు ప్రకతి వ్యవసాయ పద్ధతులు అనుసరించవలసి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమాలలో ఎన్‌ఎఫ్‌ఎంటిలు, ఎంటిలు, క్యాడర్ సిబ్బంది పాల్గొన్నారు.

# మురికి కూపంగా ప్రధాన డ్రెయిన్

- కొన్నేళ్లుగా తొలగించని పూడిక
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ఒక ప్రధాన మురికికాలవలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోయి అస్థవ్యస్థంగా మారింది. గత కొన్నేళ్లుగా కాలవలో పూడికను తొలగించకపోవడంతో పారిశుధ్యం పరిస్థితి ఆందోళనకరంగా మారింది. స్థానిక వెంకట్ నగర్ వద్ద ప్రధాన కాలవపై కొన్ని చోట్ల రేకులు, సిమెంట్ బల్లలు వేసి

రేకులతో కప్పేసిన ప్రధాన డ్రెయినేజీ

కాలవను కప్పి వేశారు. వాటిని తాకేలా పైవరకూ చెత్త భారీగా పేరుకుపోవడం, కాలవ వెంబడి కొంతమేర పిచ్చిమొక్కలు పెరిగి పోవడం వెరసి మురికి నీరు ముందుకు పారక చెత్త కుల్లిపోయి నిత్యం తీవ్ర దుర్గంధం, దోమలతో కునారిల్లుతోంది. ఇటీవల ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చొరవతో అధికారులు కొంతమేర పూడికలు తీసినా వెంకట్ నగర్ ప్రాంతంలో జన నివాసాల వద్ద మాత్రం వదిలివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు మురికికాలవపై కాంక్రీట్ బల్లలు వేసి పార్కును నిర్మించారు. అదికాస్తా నిర్వహణ లేక పెద్ద చెత్తకుప్పను తలపిస్తోంది. గతంలో కొంతమేర కాలవపై రేకులు వేశారు. అవికూడా పూర్తిగా తుప్పుపట్టి క్రిందకు కుంగిపోయాయి. పశువులు రేకులపైకి వెళ్లి మురికికాలవలో పడటం ఇక్కడ నిత్యకృత్యంగా మారింది. పెద్ద కాలవలో చెత్తను జెసిబి సాయంతో తొలగిస్తున్నారు. అయితే వెంకటనగర్ వద్ద ఉన్న అనేక అడ్డంకులతో జెసిబితో పూడిక తొలగించడానికి వీలు లేదని స్థానికులు అంటున్నారు.

**కాలవను పరిశీలించిన సిపిఎం నాయకులు**

వెంకటనగర్ వద్ద మురికి కాలవను స్థానిక సిసిఎం నాయకులు జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కాలవ దుస్థితిపై వెంకటనగర్ ప్రజలతో

డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మాట్లాడారు. మురికికాలవ పరిస్థితి చాలా దారుణంగా ఉందని, పారిశుధ్యం, ప్రజారోగ్యం పట్ల స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కాలవపై వేసిన రేకులు, సిమెంటు బల్లలు తీసి పూర్తి స్థాయిలో పూడికలు తొలగించాల్సి ఉందన్నారు. దుర్వాసన, దోమలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతూ అనారోగ్యానికి గురవుతున్నారని, అధికారులు తక్షణ చర్యలు చేపట్టిని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో వై.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పలు సంఘాల వన సమారాధనలు

ప్రజాశక్తి - జగ్గంపేట

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జ్యోతుల

పలు సంఘాల ఆధ్వర్యంలో జగ్గంపేటలోని పలు ప్రాంతాల్లో వన సమారాధన కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. స్థానిక కాపు కళ్యాణ మండపం వద్ద కాపు జెఎసి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే కొత్త బైరవకృష్ణ ఆయిల్ ఫామ్ తోటలో జగ్గంపేట ఆర్యవైశ్యులు వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు దంపతులను, డిస్టిక్ గవర్నర్ గా ఎన్నికైన మానేపల్లి బంగార్రాజు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంఎల్ఎ చేతుల మీదుగా పేద ఆర్యవైశ్యులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు, మాజీ ఎంపి వంగా గీతా విశ్వనాథ్, ఎంఎల్‌సి అనంత బాబు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, రాష్ట్ర కాపు జెఎసి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల జనసేన ఇన్‌ఛార్జ్‌లు మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మలపల్లి రమేష్, వరుపుల తమ్మయ్యబాబు, జిల్లా జనసేన అధ్యక్షులు తుమ్మల బాబు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ

నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి హసన్ షరీఫ్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. సియంగా మొదటి సంతకం డిఎస్‌సిపై పెట్టిన పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారనేది నేటికీ స్పష్టత లేదన్నారు. వచ్చే విద్యా సంవత్సరం లో ఉండవచ్చునని అసెంబ్లీలో చెప్పడం అనేది నిరుద్యోగులను మోసం చేయడమే అని అన్నారు. నిరుద్యోగులకు ఇస్తానన్నా నిరుద్యోగ భృతి కూడా అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు అయినా స్పష్టత ఇవ్వడం లేదన్నారు. గతంలో ఇలానే ఇంటికో ఉద్యోగం అని ప్రజలను మోసం చేశారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షం లేకపోవడంతో తాము చేస్తుందే చెల్లుబాటు అవుతుందనే ధోరణిలో వ్యవహరించడం సరికాదన్నారు.

## మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

అన్నదానంలో పాల్గొన్నయాత్రికులు

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులు, భక్తులు అందరికీ అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఇదిలావుండగా, మరిడమ్మ అమ్మవారిని స్టేట్ పే అండ్ అకౌంట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కర్రి పద్మజ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు, ఆశాధులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం అనంతరం ఆశీర్వచనాలతో ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

## మదుగులమ్మ ఆలయం వద్ద ఎంఎల్ఎ పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

పూజలు చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక మదుగులమ్మ ఆలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. ప్రతీ ఏటా కార్తీక మాసంలో అన్న ప్రసాద వితరణను నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, మదుగులమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ వల్లూరి శివశంకర్, మేక కాపు, నిమ్మకాయల కిరణ్, యమహా వాసు, వల్లూరి వెంకన్న బాబు, ఉప్పలపాటి శివ పాల్గొన్నారు. అలాగే మండలంలోని గొంచాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి శంకుస్థాపన పూజలను ఆలయ కమిటీ ప్రతినిధులు నిర్వహించారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చెడు వ్యవసనాలతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

విద్యార్థులు చెడు వ్యవసనాలకు లోనైతే జీవితాలు నాశనం అవుతాయని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని సూరంపాలెం గ్రామంలో ఉన్న ప్రయివేటు కాలేజీల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు చెందిన వసతి గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునేందుకు వచ్చిన మీరు ఎటువంటి చెడు వ్యసనాలకు లోను కావద్దని సూచించారు. మీ మీద నమ్మకం పెట్టుకున్న మీ తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాసలకు లోనై చదివిస్తారని, వారిని మోసం చేసేలా మసులు కోవద్దని అన్నారు. ప్రతీ ఒక్కరూ విద్యపైనే దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి, జగ్గంపేట ఎస్ఐలు శివనాగు, రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రకటన**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నియోజకవర్గం, అల్లవరం మండలం గుండెపూడి గ్రామం పోతులవారి పేట వాస్తవ్యుడు విప్పర్తి నవీన్ తెలియజేయునది ఏమనగా,

విప్పార్తి నవీన్ అను నాకు నా భార్య శ్రీజ లకు పుట్టిన నా కుమారుడు జననం మా గ్రామమైన గుండెపూడి పంచాయితీలో నమోదు కాలేదు. నా కుమారుడు విప్పర్తి హర్షవర్ధన్ 22-12-2021 న జన్మించారు. ఎవరికైన ఏమైన అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: విపర్తి నవీన్
S/o. విప్పర్తి రామారావు, డోర్ నంబర్ 2-24
గుండెపూడి, పోతుల వారి పేట,
అల్లవరం మండలం, Pin-533217,
సెల్ నెంబర్: 9177286540